క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెం లోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో వేంజేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

కమనీయం .. కల్యాణం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణం నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం బెంగళూర్‌కు చెందిన ఎస్.బుచ్చిరాజు అనే దాత రూ.లక్ష విరాళం అందజేశారు. దేవస్థానం తరపున దాతకు అన్నప్రసాద విభాగం ఏఈవో నరసింగరావు బాండ్ అందజేసి దర్శనం కల్పించారు.

అలరించిన హరికథ



హరికథ చెబుతున్న యతిరాజ్ భాగవతార్ బృందం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా సందర్భంగా నిర్వహిస్తున్న ధర్మ ప్రచారోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకుడు శేషాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. బి.యతిరాజ్ భాగవతార్ బృందం ఆధ్వర్యంలో హరికథా కాలక్షేపం నిర్వహించారు. పట్టాభిరెడ్డి తోటలో సంపత్ వినాయగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

పరవాడ: ఎలాంటి అనుమతులు లేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేసి ఇరువర్గాల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టినందుకు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్టు సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. ఈ నెల 23న రాత్రి గొతులచ్చన్న నగర్ కూడలి వద్ద కొంత మంది టీడీపీ కార్యకర్తలు సీఎం దిష్టి బొమ్మ దహనం చేసి ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు పలువురు గాయపడ్డానికి కారణమయ్యారు. దీంతో టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, బీసీ సెల్ కార్యదర్శి సన్యాసప్పారావు, గొర్లివానిపాలెం మాజీ సర్పంచ్ గొర్లి కనకారావుతో పాటు మరి కొందరు కార్యకర్తలపై ఐపీసీలో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని చెప్పారు. ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా ఎవరు ప్రవర్తించినా చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ ఈశ్వరరావు హెచ్చరించారు.

జమ్మి ఉత్సవం.. పరవశించిన భక్త జనం



విద్యుత్ కాంతుల్లో పూలతోటలోని శ్రీకృష్ణ కొలను



కోలాటం ఆడుతున్న మహిళలు

- సింహగిరికి పోటెత్తిన భక్తులు
- విద్యుత్ కాంతుల్లో కొలను

సింహాచలం: సింహగిరి భక్తులతో పులకించింది. అంతటా ఆధ్యాత్మికత ఉట్టిపడింది. మంగళవారం విజయదశమి పర్వదినాన స్వామిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి జరిగిన జమ్మివేట ఉత్సవంలో భక్తులు తరించా రు. రామాలంకారంలో స్వామిని కనులారా వీక్షించి పరవశించారు. విద్యుత్ కాంతులతో కొండదిగువ పూల తోట నూతన శోభ సంతరించుకుంది. ఉత్సవాన్ని తిలకించేందుకు పూలతోటకు వేలాది మంది భక్తులు క్యూ కట్టారు. సాయంత్రం 5గంటల సమయంలో సింహగిరి నుంచి కొండదిగువకు మెట్లమార్గంలో స్వామివారిని తీసుకొచ్చారు. అక్కడ దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, అధికారులు, అడవివ రం గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అక్కని నుంచి స్వామిని పూలతోటలోకి తీసుకెళ్లారు. పూలతోటలోని మండపంలో జమ్మివేట ఉత్సవం విశేషంగా జరిగింది. అలాగే అడవివరం పురవీధిల్లో అశ్వవాహనంపై స్వామి తిరువీధి ఘనంగా జరిగింది. దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ, సువ్వాడ శ్రీదేవి తదితరులు ఉత్సవంలో పాల్గొన్నారు.

సారె.. అదిరె



అమ్మవారి సారె ఊరేగింపులో పాల్గొన్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి

పరవాడ: స్థానిక బొంకుల దిబ్బ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని సోమవారం అమ్మవారి సారె ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భవానీ భక్తులు, సేవకులు ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలు నడుమ పురవీధుల్లో ఊరేగించారు. వివిధ రకాల పిండి వంటలతో పాటు రకరాల స్వీట్లను అమ్మవారికి భక్తి శ్రద్ధలతో సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పెద్ద చెరువు రైతు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పైల వెంకటరావు, వర్రి లక్ష్మి, పైల పైడింనాయుడు, సీహెచ్.శ్రీనివాసరావు, భవానీ భక్తులు, సేవకులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై దుర్గమ్మ



సింహ వాహనంపై దుర్గాదేవి



కుంకుమ పూజలో పాల్గొన్న దంపతులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి అమ్మవారు మంగళవారం సింహ వాహనదారియై దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజల్లో భక్తులు సతీసమేతంగా పాల్గొన్నారు. హోమశాలలో లలితా సహస్ర నామావళి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



గాయత్రీమాతకు పూజ చేస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

పెందుర్తి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పెందుర్తి ప్రాంతంలో ఘనంగా ముగిసాయి. శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయత్రీమాత ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు చేశారు. శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతిఅమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలు పేదలకు ఉచితంగా పంపిణీ చేశారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

మర్రిపాలెం: ఐదో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న వారిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కంచరపాలెం దరి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని శ్రీ నియో ఏజెన్సీ కార్యాలయంలో పేకాట ఆడుతున్నారని అందిన ఫిర్యాదు మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి, ఏడుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.70,980 నగదు, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని ఐదో పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ కేసును ఐదో పట్టణ సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వం.. సాయి రూపం



గాజుల అలంకరణలో సాయినాథుడు

పెదగంట్యాడ: స్థానిక సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతిధామంలో కొలువుదీరిన సాయిబాబాను దసరా సందర్భంగా గాజులతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సాయినాథుడిని దర్శించుకున్నారు. అభిషేకాలు, అర్చనలు చేశారు.

అగనంపూడి సాయిబాబా ఆలయంలో..

అగనంపూడి: అగనంపూడిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో సాయిబాబా కైవల్యం పొందిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ మహిళలు సాయి నామస్మరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొయ్య వెంకటరమణారెడ్డి, పెదమడక సంపత్ వినాయక ఆలయ కమిటీ చైర్మన్ మోటూరి వెంకటరమణ, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, ధర్మాల వ్యాసశర్మ, పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం



ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభించిన సర్పంచ్ సుజాతముత్యాలు

పరవాడ: ముత్యాలమ్మపాలెం గ్రామంలో శ్రీ బంగారమ్మ ఆదిదేవతల ఆలయాలకు వెళ్లే మార్గంలో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన ముఖద్వారాన్ని సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు మంగళవారం ప్రారంభించారు. ముత్యాలు తల్లిదండ్రులైన దివంగత చింతకాయల ముత్యాలు, అమ్మోరమ్మ జ్ఞాపకార్థం దీన్ని నిర్మించారు. కార్యక్రమంలో భాగంగా డప్పులు, సాముగరిడీలు, నేలడ్యాన్సు లు, చిడతలు, తప్పెటగుళ్ల వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవార్లను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, ముత్యమాంబ ఆలయ కమిటీ చైర్మన్ కూండ్రపు చిన్నంనాయుడు, కోశాధికారి కూండ్రపు శ్రీరామ్మూర్తి, మాజీ ఎంపీటీసీ చింతకాయల అమ్మోరు, మండల కోఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతి అందజేస్తున్న వెంకటరమణ

పరవాడ: తానాం గ్రామంలో ఆదార్స్ మోటార్స్ వర్కర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కబడ్డీ పోటీల్లో వర్రి కేశవ్ టీం విన్నర్‌గా నిలిచింది. అలాగే లక్కీడ్రాలో గ్రామానికి చెందిన గొరుపూటి గోవర్ధన్ ప్రథమ బహుమతిగా రిఫ్రిజిరేటర్ గెలుచుకున్నారు. అనకాపల్లి మార్కెట్ కమిటీమాజీ ఉపాధ్యక్షుడు కస్పూరి వెంకటరమణ బహుమతి అందజేశారు. దసరా వేడుకలను పురస్కరించుకొని అమూల్ డెయిరీ యాజమాన్యం సమకూర్చిన 80 స్టీల్ పాల క్యాన్లను సర్పంచ్ కస్పూరి దేవి రైతులకు అందజేశారు. అమ్మవారి లడ్డూను గ్రామానికి చెందిన పైల ఎరుకునాయుడు రూ.9 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వర్రి వసంతరావు, గ్రామ పెద్దలు రొంగలి అప్పారావు, ఆదర్స్‌మోటార్ అసోసియేషన్ ప్రతినిధులు కె.పరమేశు, కూండ్రపు కోటేశ్వరరావు, బి.బి.ఎస్.గాంధీ, పైల గణపతిరావు, చీపురుపల్లి పరుశరాం తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న భక్తులకు కొర్రబియ్యం పాయసం



భక్తులకు పాయసం అందిస్తున్న సిబ్బంది



భోజనం చేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: విజయదశమిని పురస్కరించుకుని మంగళవారం సింహగిరిపై అన్నప్రసాద భవనంలో భక్తులకు అన్నప్రసాదంతో పాటు కొర్రబియ్యం పాయసం అందజేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి భక్తులతో పాటు కలిసి అన్నప్రసాదభవనంలో సహపంక్తి భోజనం చేశారు. ఆలయ ఏఈవో పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దుర్గాదేవి ఆశీస్సులతో కార్మికుల విజయం తథ్యం



985వ రోజు దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి కార్మిక వర్గం నుంచి వస్తున్న వ్యతిరేకతే దీనికి నిదర్శనమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 985వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరాను జరుపుకోవడం ఆనవాయితీ అని, దుర్గాదేవి ఆశీస్సులతో నిరవధికంగా కొనసాగుతున్న ఉక్కు పోరాటానికి త్వరలోనే విజయం చేకూరుతుందన్నారు. కార్మికులు సాధించిన విజయాన్ని గొప్ప జరుపుకొంటామని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వ చెడు నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తున్నామని, దీనికి వ్యతిరేకంగా విశాఖ ఉక్కు కార్మికవర్గం ఐక్యంగా ఉద్యమించి ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా ధర్మ ప్రచార వారోత్సవాలు



సంకీర్తనలు ఆలపిస్తున్న సుధా సీతాపతిరావు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో ఆదివారం ధర్మప్రచార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు సుధా సీతాపతిరావు సంకీర్తనలు ఆలపించారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, ఈవో జి.వి. రమాబాయి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వినూత్నంగా దుర్గాదేవి మండపం

నవంబర్ 1వ తేదీ వరకు ఉత్సవాలు



గ్లాస్ ఫ్లోరింగ్ అక్వేరియంతో దుర్గాదేవి మండపం



సింహం ఆకృతిలో మండపం ప్రవేశ ద్వారం

సీతంపేట: క్రేజీ బాయ్స్ ఆధ్వర్యంలో సీతంపేటలో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 23వ తేదీ నుంచి నవంబరు ఒకటి వరకు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల కోసం అమ్మవారి మండపాన్ని వినూత్నంగా తీర్చిదిద్దడంతో మండపం చూడటానికి భక్తులు బారులు తీరుతున్నారు. పీవోపీ ఫాల్స్ సీలింగ్, గ్లాస్ అక్వేరియం ఫ్లోరింగ్, సింహం ఆకృతిలో మండపం ప్రవేశ ద్వారం చూపరులను విశేషం ఆకట్టుకుంటున్నాయి. మండపం లోపలి భాగం ఇంటిని తలపిలచేలా ఇంటీరియర్ డిజైన్ చేశారు. అలాగే గ్లాస్ ఫ్లోరింగ్ ఏర్పాటు చేశారు. గ్లాస్ ఫ్లోరింగ్ కింద అక్వేరియంలో చేపలు తిరుగుతూ ఉండటం మండపానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మండపం నిర్మాణానికి లక్షన్నర ఖర్చు అయిందని, రోజూ విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని క్రేజీ బాయ్స్ కమిటీ తెలిపింది. కమిటీ సభ్యులు అచ్యుతరావు, వై.గణేష్, సంతోష్, బి. సంతోష్, పి.శేఖర్, కె. రాంమూర్తి, మహేష్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో చోరీ



ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న దుస్తులు, వస్తువులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో సెక్టార్-11లోని 522డీ క్వార్టర్‌లో దొంగతనం జరిగింది. స్టీల్‌ప్లాంట్ క్రైం పోలీసులు అందించిన వివరాలివి.. క్వార్టర్స్‌లో నివాసముంటున్న ఉద్యోగిని అనూజ మిశ్రా స్టీల్‌ప్లాంట్ కంపెనీ ఎఫైర్స్ విభాగంలో పని చేస్తున్నారు. క్వార్టర్స్‌లో ఆమె తన తల్లితో ఉంటున్నారు. ఈ నెల 16న వారు ఊరెళ్లారు. మంగళవారం ఉదయం అదే బ్లాక్‌లో ఉన్న సహోద్యోగులు చూడగా ఇంటి ముందు తాళంకప్ప లేదు. దీంతో అనుమానం వచ్చి అనూజ మిశ్రాకు సమాచారం ఇవ్వగా.. ఆమె స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఊరి నుంచి తిరిగివచ్చిన అనంతరం ఆమె పరిశీలించగా.. ఇంట్లో ఉండాల్సిన సుమారు రెండు తులాల బరువు కలిగిన చెవి దిద్దు, రింగులు, ముక్కు పుడకలు, 100 తులాల వెండి సామగ్రి చోరీకి గురైనట్టు గుర్తించి, పోలీసులకు తెలియజేశారు. దీంతో క్రైం ఎస్ఐ ఎల్. శ్రీనివాసరావు క్వార్టర్‌కు వచ్చి పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. అనూజ మిశ్రా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సీతమ్మధార : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో లభించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అక్కయ్యపాలెం లలిత గుడి వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి(60) చనిపోయినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు విజయనగరం జిల్లాకు చెందిన వ్యక్తి అని భావిస్తున్నారు. హెచ్‌సీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచశాంతి స్థాపనకు కృషి



ప్రపంచ శాంతి కోసం ప్రతిజ్ఞ చేస్తున్న ఆదర్శహిందీ ప్రేమీ మండలి విద్యార్థులు

తగరపువలస: ఐక్యరాజ్యసమితి 79వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి విద్యార్థులు ప్రపంచ శాంతి కోసం ప్రతిజ్ఞ చేశారు. మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఐక్యరాజ్య సమితిలో 192 సభ్య దేశాలకుగాను 15 దేశాలకు భద్రతా మండలిలో సభ్యత్వం ఉంటే కేవలం 5 అగ్రరాజ్యాలకే వీటో అధికారం ఉందన్నారు. ఐక్యరాజ్యసమితికి సొంతంగా సైన్యం లేకపోవడం వల్ల వీటో అధికారం కలిగిన అగ్రరాజ్యాలు తరచూ యుద్ధంలో పైచేయి సాధిస్తున్నాయని వివరించారు.

యువతి అదృశ్యం

మర్రిపాలెం: కుమార్తె అదృశ్యమైందని ఆమె తల్లి ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. గవర కంచరపాలెం దరి రామమూర్తి పంతులుపేటలో ముద్దుని దుర్గాప్రసాద్, భార్య కనకమహాలక్ష్మి, కుమార్తె లక్ష్మి నివసిస్తున్నారు. లక్ష్మి (18) పదో తరగతి వరకు చదువుకుని ప్రస్తుతం ఇంట్లోనే వుంటుంది. ఈ నెల 19న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కంగారుపడిన తల్లిదండ్రులు బంధువుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోయింది. ఆమెకు ఫోన్‌చేస్తే స్విచ్ ఆఫ్ రావడంతో యువతి తల్లి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విండ్‌బాల్ క్రికెట్ విజేత ‘రైజింగ్ స్టార్స్’



విజేతలకు బహుమతులను అందజేస్తున్న కరణంరెడ్డి

గాజువాక: జీహెచ్‌ఆర్ యూత్ ఆధ్వర్యంలో గాజువాక హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన విండ్‌బాల్ క్రికెట్ పోటీల్లో విజేతగా రైజింగ్ స్టార్స్ జట్టు నిలిచింది. ద్వితీయ స్థానాన్ని హైస్కూల్ రోడ్ యూత్ జట్టు గెలుచుకుంది. ఈ సందర్భంగా విజేతలకు బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు బహుమతులను ప్రదానం చేశారు. మొదటి స్థానం సాధించిన జట్టుకు రూ.10వేలు, ద్వితీయస్థానం సాధించిన జట్టుకు రూ.6వేలు నగదుతో పాటు రెండు జట్లకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా పెంటారావు, బీజేపీ నాయకుడు గూటూరు శంకరరావు, పోటీల నిర్వాహకులు గణేష్, మధు, జగదీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్నపన తిరుమంజనం



పూజలందుకున్న ఉత్సవ మూర్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. అనంతరం టీటీడీ అర్చకులు, వేద పండితులు అభిషేకాలు, పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.